క్లుప్తంగా

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని ఇటుకనెల్లూరులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని చెట్లు కాలిపోయాయి. వివరాలు..నాగరాజుకు చెందిన మామిడితోట, నీలగిరితోటలో ఆదివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఎవరో ధూమపానం చేసి బీడీ లేదా సిగరెట్ ముక్క పడేయడంతో వేసవి తీవ్రత ఉండటం మూలాన మంటలు రేగినట్లు తెలుస్తోంది. సమాచారం అందడంతో అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ప్రమాదంలో రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

నంది వాహనంపై కాశీ విశ్వేశ్వరుడి విహారం



పలమనేరు: పట్టణంలోని శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అధికార నంది వాహనంపై పట్టణంలోని వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం వాహనంపై ఊరేగారు. ప్రజలు కర్పూర నీరాజనాలు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరభద్ర, గోపాలక్రిష్టారెడ్డి, హరీష్‌రాయల్, ఆలయ ఈఓ కమలాకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి రూరల్: వేధిస్తున్న అనారోగ్యానికి తోడు సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ తెలిపిన వివరాల మేరకు... వెదురుకుప్పం మండలం తిరుమలయ్యగారి పంచాయతీకి చెందిన టి.శశి(16) తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికకు ముందు నుంచే గ్యాస్ట్రిక్ సమస్య ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు రెండు రోజుల క్రితం వచ్చాయి. ఇందులో ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెందిన శశి ఆదివారం కళాశాల వసతి గృహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన రూమ్‌మేట్ ప్రవల్లిక హాస్టల్ కేర్‌టేకర్‌కు సమాచారం ఇచ్చింది. హాస్టల్ సిబ్బంది వచ్చేసరికే శశి మృతి చెందింది. శశి తల్లి మమత ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తమీమ్ అహ్మద్ తెలిపారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తిరుచానూరులో ర్యాలీ

తిరుచానూరు(చంద్రగిరి): మూగజీవాలను పంచి మాంసాహారంగా తీసుకోవడం కన్నా సంపూర్ణ శాకాహారంతో మరింత ఆరోగ్యం సిద్ధిస్తుందని తిరుచానూరు శ్రీపద్మావతి ధ్యానమందిరం నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తిరుచానూరు, యోగిమల్లవరం ప్రాంతాల్లో మెగా శాకాహార సద్భావన ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తిరుమల, తిరుపతి దివ్యక్షేత్రాల పవిత్రతను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. బ్రహ్మర్షి పితామహుడు పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా, మూగ జంతువుల, వన్యప్రాణుల సంరక్షణార్థమై, సకల జీవుల స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పిరమిడ్ శాకాహార ర్యాలీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ వీజీఓ బాలిరెడ్డి, కంచి రఘురామ్, వట్లూరి శివ, నాగకృష్ణ పాల్గొన్నారు.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు

ఊరంతా బిస్కెట్ల తయారీ

- 'ఖాన్‌సాబ్‌మిట్ట' బిస్కెట్లు భలే రుచి
- 40 ఏళ్లుగా మైనారిటీలకు ఇదే కుటీర పరిశ్రమ
- ప్రభుత్వ ప్రోత్సాహం, రుణాలతో వ్యాపార విస్తరణ
- బిస్కెట్లకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడులో మంచి ఆదరణ

ఘుమఘుమలాడే సువాసన.. నోట్లో పెట్టుకోగానే అలా..అలా కరిగిపోతూ..వహ్వా! అనిపించే రుచికరమైన బిస్కెట్లు. ఒక్కసారి రుచి చూస్తే మిగతా వెరైటీలు కూడా లాగిద్దామనిపించే కమ్మదనం. ఇదీ మండలంలోని ఖాన్‌సాబ్‌మిట్టలో తయారయ్యే బిస్కెట్ల ప్రత్యేకత. ఆ ఊరిలో అడుగు పెడితే చాలు బిస్కెట్ల పరిమళం మనల్ని కమ్మేస్తుంది. ఇంకెందుకాలస్యం.. మనమూ ఓ లుక్కేసి నోట్లో వేసుకుందాం రండి..!



బిస్కెట్లను బట్టీలో వేడి చేస్తున్న తయారీదారులు

చౌడేపల్లె: ఖాన్‌సాబ్‌మిట్టలో సుమారు వంద కుటుంబాలు ముస్లిం మైనారిటీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందులో 80 కుటుంబాలకు బిస్కెట్ల తయారీయే జీవనాధారం. నాలుగు దశాబ్దాలుగా ఒక తరం నుంచి మరో తరం బిస్కెట్ల తయారీని వారసత్వంగా అందుకుంటూ తమదైన ముద్ర వేస్తున్నారు. బిస్కెట్లకు ప్రజల్లో మంచి ఆదరణ లభించడంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడవడంతో వ్యాపారం విస్తరించింది. ఆ కుటుంబాల్లోని పిల్లలు కూడా గ్రామంలోని ఉర్దూ మీడియం యూపీ స్కూల్‌లో 8 వరకు, ఆ తర్వాత దాదేపల్లెలోని ఉర్దూ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నారు. కొందరు మాత్రం మదరసాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఇలా చదువుతూనే తీరిక వేళల్లో బిస్కెట్ల తయారీ పాలు పంచుకుంటూ నైపుణ్యం పొందుతున్నారు. వైఎస్సార్ క్రాంతి పథం సహకారంతో 2022లో నాబార్డు నుంచి ఒక్కో కుటుంబం రూ.50వేల నుంచి రూ.లక్ష పైచిలుకు ఇలా మొత్తంగా రూ.3.50 కోట్ల రుణాలు పొందాయి. నాబార్డుతోపాటు మహిళా సంఘాలు సైతం బిస్కెట్ల మార్కెటింగ్‌కు సైతం చేయూతనిస్తున్నాయి.



విక్రయానికి సిద్ధం చేసిన బిస్కెట్లు

బిస్కెట్లను ఎలా తయారు చేస్తారంటే..

- బిస్కెట్ల తయారీకి మైదా, చక్కెర, డాల్డా, (బేకరీ), కొబ్బరి, రాగి అటా, బూస్ట్, చెర్రీస్, తెల్లనువ్వులు, డ్రై ఫ్రూట్స్, చాక్లెట్ పౌడర్ వినియోగిస్తారు.
- వెన్నబిస్కెట్, రాగి మాల్ట్ బిస్కెట్, బూస్ట్ బిస్కెట్, సాల్ట్ స్పెషల్ బిస్కెట్, చాక్లెట్ బిస్కెట్, కొబ్బరి బిస్కెట్, ఫ్లవర్ బిస్కెట్‌లతోపాటు దిల్‌పసంద్‌లు ఇక్కయ తయారుచేస్తారు.
- తొలుత 20 కేజీల చొప్పున చక్కెరను మెషిన్‌లో వేసి పొడరు చేస్తారు. మైదా, డాల్డా, చక్కెర పొడర్‌ను మెషిన్‌లో వేసి అర్ధగంట పాటు మిక్స్ చేస్తారు. పిండి మెత్తగా ముద్దగా చేసిన తరువాత దానిని దిమ్మెపై ఉంచి వివిధ ఆకృతుల్లో వాటిన్ కట్ చేస్తారు. ఆ తర్వాత ఇంటి ఆవరణలోని బట్టీలలో ముందుగానే కట్టెలతో సరిపడా వేడి చేసి, కట్ చేసి ఉంచి బిస్కెట్లను పొడవాటి ట్రేలలో పెట్టి, 10 నుంచి 15 నిమిషాల వరకు వేడిచేస్తారు. ఆపై, వాటిని ఆ ట్రేల నుంచి బయటకు తీసి చల్లారిన తరువాత డబ్బాలలో నిల్వచేసి మార్కెట్లకు తరలించడానికి సిద్ధం చేస్తారు.



పిండి కలిపే యంత్రం





బిస్కెట్లను తగిన ఆకృతిలో కట్ చేస్తూ..

ప్రధాన మార్కెట్లు

చౌడేపల్లె నుంచి తిరుపతి, అనంతపురం, కడప, రాయచోటి, చిత్తూరు, కర్ణాటక, తమిళనాడు, హొసూరు, చిలగట్ల, చింతామణి, దేవనహళ్లి, వేలూరు తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తారు.

జీవనోపాధికి నిశ్చింత



మాపెద్దల కాలం నుంచి బిస్కెట్ల తయారీయే జీవనాధారం. మాకు ఇదే ఉపాధి. మా పిల్లలకు కూడా బిస్కెట్ల తయారీ, మార్కెటింగ్ మెళకువలు నేర్పిస్తున్నాం. వారూ దీనిలో ఆసక్తి చూపుతున్నారు.

–ఎస్.బషీర్, ఖాన్‌సాబ్‌మిట్ట

గిట్టుబాటు



రూ.500 కూలీ గిట్టుబాటు అవుతోంది. రోజంతా కష్టపడి బిస్కెట్లను తయారు చేసి వాటిని వివిధ గ్రామాల్లో అమ్మితే ఖర్చులు, పెట్టుబడి పోను రోజు కూలి రూ.500 నుంచి రూ.650 వరకు గిట్టుతోంది. వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సంఘాల నుంచి ప్రభుత్వం చేయూతనిచ్చి ప్రోత్సహిస్తోంది.

–ఎస్.బాషా, ఖాన్‌సాబ్‌మిట్ట

మూడు రాష్ట్రాల్లో మంచి గిరాకీ

ఖాన్‌సాబ్‌మిట్ట బిస్కెట్లకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. ముందుగానే అక్కడి వ్యాపారులు మాకు ఆర్డర్ ఇస్తారు. వాళ్లు ఇచ్చిన టైం లోపు ఆటోలలో ఆయా ప్రాంతాలకు బిస్కెట్లను రవాణా చేసి అందజేస్తున్నాం.

–నూరుల్లా, ఖాన్‌సాబ్‌మిట్ట

బిస్కెట్ల తయారీకి చేయూత



ఖాన్‌సాబ్‌మిట్టలో మొత్తం 9 సంఘాలున్నాయి. వీరిలో రూ.2.50 లక్షల చొప్పున లవ్లీహుడ్ ద్వారా రూ.20 లక్షలు రుణాలు మంజూరు చేశాం. 50 మందికి ఒకొక్కరికి రూ.40 వేల చొప్పున రుణాలతోపాటు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.2.50 కోట్లు మంజూరు చేశాం. వ్యాపార సేవల కోసం స్త్రీనిధి, సీఐఎఫ్, వీఓ నుంచి ఆసక్తి కలిగిన తయారీదారులకు విరివిగా రుణాలుఇచ్చాం. సకాలంలో రీపేమెంట్ చేస్తున్నారు. సంఘాల బలోపేతంతోపాటు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం చేయూతనిస్తోంది.

–నర్సోత్తమరెడ్డి, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, చౌడేపల్లె

నేడు దుర్గామాత ఆలయంలో చండీ హోమం

వి.కోట: పట్టణంలో దుర్గానగర్‌లోని శ్రీ దుర్గామాత ఆలయంలో ఉదయం 10 గంటలకు చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో రూ 1.5 కోట్లతో ఆలయ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా చండీ హోమం చేయనున్నామని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఉదయం మహా కుంభాభిషేకం, సాయంత్రం దుర్గామల్లేశ్వరస్వామి కల్యాత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

సదుంలో మండల సర్వసభ్య సమావేశం

సదుం: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా మధ్వాచార్యుల జయంతి



మధ్వాచార్యుల పూజకు సామగ్రి అందజేస్తున్న ఈవో వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం ద్వైత మతం మధ్వాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో మధ్వాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. జీవుడు, దేవుడు వేర్వేరని, జీవ, పరమాత్మ రెండుగా ఉంటాయని చెప్పే ద్వైతమతాన్ని మధ్వాచార్యులు నెలకొల్పారని వేదపండితులు వివరించారు. ఆయనను వాయుదేవుడి అంశగా భావిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

సాకారమవుతున్న ముస్లింల కల

- మంత్రి, ఎంపీ చొరవతో షాదీ మహల్ నిర్మాణం పూర్తి
- ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ముస్లిం మైనారిటీలు

ముస్లింల మైనారిటీల కల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో సాకారమవుతోంది. దాదాపు ఒకటిన్నర దశాబ్ద కాలంగా షాదీమహల్ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతోంది.



నిర్మాణం పూర్తయిన షాదీమహల్

సదుం: మండలంలో సుమారు 1500 పైచిలుకు ముస్లిం మైనారిటీ కుటుంబాలు ఉన్నాయి. వారి సౌకర్యం కోసం పదిహేనేళ్ల క్రితమే షాదీమహల్ నిర్మాణ పనులు ప్రారంభమైనా ప్రభుత్వాలు సహకరించకపోవడం, నిధుల లేమి..ఇత్యాది కారణాలతో జాప్యం చోటుచేసుకుంది. దీనిమూలాన ముస్లింల నిఖా, ఇతర శుభకార్యాలను నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడేవారు. సరైన సౌకర్యం లేక ఇళ్లవద్దనే అరకొర వసతులతోనో, లేకపోతే వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు కల్యాణ మండపాల్లోనో నిర్వహించుకోవాల్సి వచ్చేది. వారి ఇబ్బందులు గుర్తించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవ చూపారు. రూ.90 లక్షలను మంజూరు చేయించారు. దీంతో పనులు వేగం పుంజుకున్నాయి. రెండు అంతస్తుల షాదీమహల్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది. దీంతో ముస్లిం మైనారిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ సౌకర్యం



ముస్లిం మైనారిటీ కుటుంబాలకు షాదీమహల్ అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది. గతంలో పేదలు శుభ కార్యాలు చేయడానికి ఇబ్బందులు పడేవారు. ఇక ఆ పరిస్థితి ఉండదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు ఎంతగానో చేస్తోంది.

–సయ్యద్‌బాషా, మాజీ సర్పంచ్, సదుం

వారి మేలు మరువలేం



షాదీ మహల్ నిర్మాణం పూర్తి చేయడం వెనుక మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారం ఎంతో ఉంది. మైనారిటీ కుటుంబాల అభ్యున్నతికి వారు ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారు. షాదీమహల్ నిర్మాణంతో తక్కువ ఖర్చుకే శుభకార్యాలు నిర్వహించుకోవడానికి వీలవుతుంది.

మస్తాన్, రిటైర్డ్ టీచర్, సదుం

టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రామకుప్పం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు యూటీఎఫ్ నాయకులు స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆదివారం పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సంసిద్ధులు కావడం, మానసిక ఆందోళనకు గురవకుండా పరీక్షలను సులువుగా రాయడంపై సూచనలు– సలహాలనిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని యూటీఎఫ్ నేతలు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రఘుపతిరెడ్డి, పాల్‌దేవ్, సూర్య, మహేష్ పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి చేస్తాం

పాకాల: రాష్ట్రంలోని బీసీల అభివృద్ధికి కృషి చేస్తూ, వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజగౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని కె.వడ్డేపల్లిలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ ఆత్మీయ గౌరవసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా పాలకల సుబ్రమణ్యంను ఎన్నుకున్నారు. ఈ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవ శంకరరావు, స్టేట్ డైరెక్టర్ రఘుపతి, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచార్య, నియోజవర్గం అధ్యక్షుడు జగదీశ్వర్, వాసు పాల్గొన్నారు. పాలకల రమణ, మునిరాజు, మురళి, రామూర్తి, పురుషోత్తం, మునస్వామి, మురగయ్య పాల్గొన్నారు.

గీతామకరంద గుళికలు గ్రంథం ఆవిష్కరణ



గీతామకరంద గుళికలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మేడసాని మోహన్ తదితరులు

తిరుపతి కల్చరల్: డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు తెలుగులోకి అనువదించిన గీతామకరంద గుళికలు(శ్రీమద్భగవద్గీత) గ్రంథావిష్కరణ సభ విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం రాస్ భవన్‌లో నిర్వహించారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గోవిందస్వామి నాయుడు గ్రంథ పరిచయం చేశారు., ప్రముఖ రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడారు. గ్రంథ కర్తను పలువురు వక్తలు అభినందించారు. పలువురు కవులు, రచయితలు, సాహితీ వేత్తలు డాక్టర్ మాలేపాటి పురుషోత్తమాచారి, డాక్టర్ నెమలేటి కిట్టన్న, ఏనుగు అంకమ నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, గొడుగు చింత గోవిందయ్య, మూరిశెట్టి తదితరులు గోవిందు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్‌లోనూ డేటా సైన్స్‌దే ప్రధాన పాత్ర

తిరుపతి సిటీ: పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగంలోనూ డేటా సైన్స్ ప్రధాన పాత్ర వహిస్తోందని విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ యూ.రామ మోహన్ తెలిపారు. ఆదివారం మహిళా వర్సిటీలో ఇండి యన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్(ఐఎస్‌పీఎస్), ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం పూర్వ విద్యార్థులు, మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గణాంకాలు–డేటా సైన్స్‌లో పురోగతి అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ తాను స్టాటిస్టిక్స్ విద్యార్థినేనని, డేటా సైన్స్‌లో స్టాటిస్టిక్స్ పాత్ర ప్రముఖ మైందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన భూమికి పోషిస్తుందని చెప్పా రు. స్టాటిస్టిక్స్ కాన్సెప్ట్, డేటా సైన్స్ అల్గరిథెమ్స్ మధ్య ఉన్న ఇంటర్నల్ సారూప్యతను ఆయన వివరించారు. అనంతరం 2022, 23వ బ్యాచ్‌కు చెందిన ఎస్వీయూ ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ విభాగంలో ప్రతిభ చూపి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు జాహ్నవి, ప్రియాంకకు ఆయన గోల్డ్‌మెడల్స్ అందించారు. ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి. రాజశేఖర్‌రెడ్డి, స్విమ్స్ సైన్స్ విభాగం డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, ప్రొఫెసర్ ఎస్ఆర్. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శివపార్వతి, డాక్టర్ ఆర్ విష్ణువర్ధన్, పి.వెంకటేశన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ అందజేస్తున్న ముఖ్య అతిథులు

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నారాయణ స్వామివారి కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లక్ష్మీ నారాయణ స్వామివారికి సుప్రభాతం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక అలంకరణలతో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని భక్తులు కనులవిందుగా వీక్షించారు. కార్యక్రమంలో చిత్తూరు నగరానికి చెందిన సింధుప్రియ, కీర్తి ఉభయదారులుగా వ్యవహరించగా, అనంతరం ఆలయ మర్యాదలతో ఉభయదారులకు పట్టువస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేశులు రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 22వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆలయంలో 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. 22న తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు.

ప్రాంతీయ పరిమళాలు వెదజల్లే 'మేకల బండ'



మేకల బండ నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: పాత చిత్తూరు జిల్లా ప్రాంతీయ పరిమళాలు వెదజల్లే నవల మేకల బండ అని వక్తలు కొనియాడారు. మూగజీవాల నేపథ్యంతో రాసిన ఈ నవల తాత్విక చింతనతో కూడుకున్నదిగా అభివర్ణించారు. తిరుపతి రచయిత ఆర్‌సీ. కృష్ణస్వామి రాజు రచించిన మేకల బండ నవల ఆవిష్కరణ సభ ఆదివారం సాయంత్రం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. శ్వేత డైరెక్టర్ భూమన్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆర్.రాజేశ్వరమ్మ పుస్తక సమీక్ష చేశారు. ఆమె మాట్లాడుతూ మనిషిలాగే మూగజీవాలకు ఆలోచనా శక్తి వస్తే అవి కూడా సంకుచిత జాఢ్యాలకు గురి అవుతాయని రచయిత తెలియజేశారన్నారు. వ్యంగ్య రూపంలో ప్రస్తుత సమాజం తీరుతెన్నులను, వివిధ పాత్రల ద్వారా చురకలు అంటించారని తెలిపారు. మూగజీవాలకు కూడా స్పందించే గుణం ఉందని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనమీద ఉంద న్నారు. సహజ వాతావరణాన్ని మనిషి కలుషితం చేయడం వలన జీవాలకు సైతం కృత్రిమ గర్భధారణ పద్ధతుల అవసరం వస్తోందని రచయిత ఆవేదన ఆలోచింపదగిందని తెలిపారు. వెటర్నరీ వర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌వీ.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, సజీవమైన భాషా శైలి ఈ నవలలో ఉందని, పుత్తూరు ప్రాంత స్వరం పలుకుతోందని కొనియాడారు. సాహితీ ప్రియులు డాక్టర్ మన్నవ గంగాధర్‌ప్రసాద్, మల్లారపు నాగార్జున, కందారపు మురళి, సుధాకర్‌రెడ్డి, పేరూరు బాల సుబ్రమణ్యం , టెంకాయల దామోదరం, ఏ.కృష్ణమనాయుడు, పలువురు రచయితలు పాల్గొన్నారు.